తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# క్రీడాంధ్ర ప్రదేశ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

**- స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు**



సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు

వెంకటగిరి, జనవరి 17 ప్రభాతవార్త: క్రీడాంధ్ర ప్రదేశ్‌గా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. వెంకటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలప్లే గ్రౌండ్లో కోదండ రామయ్య మెమోరియల్ వారు రెండు రోజులు పాటు నిర్వహించే వాలీబాల్ పోటీలను సాఫ్ చైర్మన్ ప్రారంభించారు. రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని క్రీడా ప్రాంగణాలను కేవలం ఆటల పోటీలకు మాత్రమే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవో తెచ్చింది అని తెలిపారు. క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితే వేసేందుకు వారికి నైపుణ్యం లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కోదండ రామయ్య మెమోరియల్ ట్రస్ట్ వారి సేవలు ఎంతో గొప్పవని తెలిపారు. కోదండరామయ్య మెమోరియల్ ట్రస్టు క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. వాలీబాల్ వేసి ఆయన పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ సీసీ నాయుడు, రాజేశ్వరరావు, సిఐ ఏవి రమణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, కోటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఏం చేస్తున్నారు కాదూ... ఎంత సంపాదించారో!

# చిరు ఉద్యోగులు బంగారు కొండలు

**-ఆదాయానికి మించి కోట్లల్లో ఆస్తులపై ఏసిబి నిఘా?**



**ప్రభాతవార్త-తిరుపతి:**
చేసేది చిన్నపాటి ఉద్యోగమైనా...వేలల్లో వేతనమైనా...కోట్లల్లో ఆస్తులు కలిగివున్నారనే ఫిర్యాదులు, ఆరోపణలపై ఏసిబి యాక్షన్ కొరవడిందనే విమర్శలు అటు చిత్తూరు జిల్లాలో ఇటు తిరుపతి జిల్లాలో గుప్పుమంటోంది. ప్రధానంగా టిటిడి, పోలీసు, రెవెన్యూశాఖల్లో అటెండర్, జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులు కోట్లాదిరూపాయలు ఆస్తులు సంపాదించారనే ఆరోపణలు ఇప్పుడు ఆయా శాఖల్లోనే వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఆదాయం వచ్చే శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు ఉన్నాయా అనే విషయంకాకుండా ఆదాయానికి మించి ఆస్తులు కలిగి వున్నారనే విషయంపై ఏసిబి దృష్టి పెట్టాలని పలువురు ఉద్యోగులు బహిరంగంగానే చెబుతున్న మాటలు. అయితే ఏసిబి అధికారులు మాత్రం ప్రభుత్వశాఖల్లో పనిచేస్తూ ఉచితంగా చేయాల్సిన పనులకు లంచం అడిగే ఉద్యోగులు, అధికారుల సమాచారం ఇస్తే పట్టుకుంటామని, ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్నారనే ఆరోపణల కేసుల్లో ఆధారాలు కూడా ఇస్తే తప్ప చేసేదేమిలేదనే వాదన వినిపిస్తున్నారు. తిరుపతి జిల్లాలో ఏసిబి దాడులు దాదాపు ఏడాది కాలంగా స్తబ్ధుగా ఉందనేది తెలుస్తోంది. టిటిడిలో వందమందికిపైగా క్రిందిస్థాయి ఉద్యోగులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్నారనేది హాట్‌టాఫిక్‌గా మారిన విషయం . పదేళ్ళక్రిందట టిటిడిలో అక్రమార్కులపై ఏసిబి కొరఢా ఝుళిపించింది. కొందరు చిరు ఉద్యోగులను ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్నారని పట్టుకుంది. ఇలాంటి వారే ఇంకా ఉన్నారనేది ఇప్పుడు ఉప్పందుతున్న సమాచారం. మరీ ఏసిబి అధికారులు టిటిడిలో అక్రమార్కులను పట్టుకోవడంపై ఎందుకు వెనుకంజవేస్తున్నారనేది ఆ దేవునికే ఎరుక. గతంలోనే టిటిడిలో ఓ ఉన్నతాధికారి కొంతమంది ఉద్యోగుల విషయంపై నేరుగా ఏసిబి అధికారులకు సమాచారం అందించిన సందర్భం ఉంది. మరీ ఇప్పుడు ఏసిబికి ఫిర్యాదులు అందుతున్నా టిటిడిపై దాడి చేయడానికి సంశయం వెనుక ఆంతర్యమేమిటోనని విమర్శలు లేకపోలేదు. ఇక ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం చేకూర్చే రెవెన్యూ, పోలీస్ శాఖల్లోనూ కొంతమంది అధికారులు తమతమ బినామీల పేర్లతో ఆస్తులు కూడగట్టి పబ్బం గడుపుకుంటున్నారనేది కూడా ఏసిబికి అందిన చిట్టా. ఈ రెండుశాఖల్లో తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు చిన్న చిన్న పనులకు, బిల్లులు మంజూరుకు కూడా డబ్బులు అడుగుతున్నారనేది జనంలో వాదనలు. ఆర్ఐ స్థాయి అధికారులు, ఆపై అధికారులు, ఎస్ఐ, సిఐ స్థాయి ఆపై అధికారులు లంచం అడిగినా, ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్నా ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని ఏసిబి వర్గాల విజ్ఞప్తి.

## పిండ ప్రధానానికి తిప్పలు...

# పట్టించుకోని అధికారులు

**-చైర్మెన్ పరిశీలించి, సూచనలు చేసిన చర్యలు ఎక్కడ?**
**- రాఘవేంద్ర మఠం మండపం వద్ద నదిలోకి మెట్లు ఏర్పాటు చేయాలి**


స్వర్ణముఖి నది ఒడ్డున పిండ ప్రధానం స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మెన్(ఫైల్ ఫోటో)

శ్రీకాళహస్తి, జనవరి 17 ప్రభాతవార్త: స్వర్ణముఖి నది ఒడ్డున పితృదేవతలకు తర్పాణాలు వదిలే సంప్రదాయం అమలులో ఉంది. సంక్రాంతికి పర్వదినాన నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి స్వర్ణముఖి నదీ తీరాన ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ ఇక్కడ పర్యటించారు. పరిశుభ్రతకు సంబంధించి పలు సూచనలు చేసారు. వెంటనే నదీ తీరాన్ని పరిశుభ్రం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కానీ శుక్రవారం ఏం జరిగింది. యథాతథంగా కష్టాలు తర్పణాలు వదలటానికి సరైన దారి లేక తిప్పలు, కాళ్ళకు బురద అంటించుకుంటూ ఇరుకైన చెక్కమెట్లపై నుంచి దిగి తర్పాణాలు వదిలే పరిస్థితి. తర్పాణాల నీటిని నదిలో పోయడానికి వెళ్ళే మార్గం పారిశుధ్యం అధ్వానంగా వుంది. ఈ మార్గంలో సిమెంటు మెట్లు ఏర్పాటు చేస్తే ఎంతో సౌకర్యవంతంగా వుంటుందని ప్రజల అకాంక్ష. మరి ఆదివారం తై అమావాస్య, కానీ శనివారం వరకు దేవస్థానం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. సంక్రాంతి కన్నా తై అమావాస్యకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది.మరి ఏం తిప్పలు ఎదుర్కొవాలో? ఏమో?

**పారిశుద్ధ్య అధ్వానం:**
శ్రీకాళహస్తీశ్వరుని పాదాల చెంత పితృదేవతలకు జీవనది స్వర్ణముఖి నదిలో తర్పాణాలు వదలటానికి వచ్చిన భక్తులకు కనీస సదుపాయాలు కల్పించటంలో ఇటు అధికారులు అటు పాలకమండలి విఫలమయ్యారని చెప్పవచ్చు. పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ విభాగం పట్టించుకోలేదని నిర్లక్ష్యంగా వ్యవహారించారని చెప్పవచ్చు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఇక్కడ కనీసం పారిశుద్ధ్యం కూడా చేపట్టలేదు. ఆలయంలో వందలాది మంది పారిశుద్ధ్య కార్మికులున్నారు.కానీ స్వర్ణముఖి వద్దున భక్తులు నదీ స్నానమాచరించి వదలిపెట్టి వస్త్రాల గుట్టలు చూపరులను కలవర పెట్టింది. ముక్కులు మూసుకొని నదిలో దిగాల్సి వచ్చింది. దీనికి తోడు నదిలో దిగటానికి సరైన దారి లేదు. ఓ చెక్క మీద నుంచి నదిలోకి దిగాలంటే భయం గుప్పిట్లో కనబడ్డారు. ఇక ఇక్కడ జలవినాయకుని ఆలయం పక్కన ఏర్పాటు చేసిన స్నానఘట్టాలు, ర్యాంప్‌పై ఆకతాయిలు, గంజాయి బ్యాచ్‌లు, మందుబాబులు వాడిన మందు సీసాలతో నిండి ఉంది. అయితే ఇక్కడ పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు, బయటి ప్రాంతాల నుంచి వచ్చే వారు తర్పణాలు వదలటానికి వస్తారని తెలిసినా అధికారులు ఎందుకు పట్టించుకోలేదో? ముక్కంటీశునికే ఎరుక.మరి పాలకమండలి ఉన్నా ప్రేక్షక పాత్ర వహించటం గమనింగదగ్గ విషయం.నది పవిత్రను కాపాడాల్సిన దేవస్థానం ఎందుకు స్పందించలేదనేది మరో శేష ప్రశ్న.

# వైభవంగా సంక్రాంతి కొండచుట్టు వేడుకలు

**శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వెంట ద్రౌపధీ భీమార్జునులు-భక్తులకు మాజీ జడ్పీటిసి సరిత రమణమూర్తి అన్నదానాలు- పోలీసు రక్షణలో పోటెత్తిన భక్తజన**


శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి కొండచుట్టులో భక్త జనం

చంద్రగిరి, జనవరి 17 ప్రభాతవార్త: సత్యప్రమాణాలకు నెలవైకొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి సంక్రాంతి కొండచుట్టు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. చంద్రగిరి గ్రామదేవతగా భక్తుల కొంగుబంగారమై వెలుగొందు తున్న శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో సంక్రాంతి మహోత్సవాలను ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి పాలక మండలి, ఈఓ మమత ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం అమ్మవారికి వేకువజామున ఆలయ అర్చకులు సూరి స్వామి నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి అశ్వవాహనంపై అధిష్టింపజేశారు. తదుపరి ఆలయం నుండి మేళతాళాలు మంగళ వాయిద్యాలు, బ్యాండు బాజాలు, కేరళ బృంద వాయిద్యాలతో అట్టహాసంగా ధర్మరాజుల స్వామి వారి ఆలయం వద్దకు చేరుకున్నారు. కొండచుట్టు మహోత్సవాలలో అమ్మవారి ముందు ధర్మరాజుల వారు, భీమసేనుడు, అర్జునుడు, ద్రౌపధి సమేతంగా సాగుతుండగా వారిని అనుసరిస్తూ అమ్మవారు భక్తరక్షణకు బయలుదేరారు. సాయంత్రం 5 గంటలకు బయలుదేరి అమ్మవారు చంద్రగిరి పాతపేట, వెంకటంపేట, అగరాల, ఐతేపల్లి, పులిత్తివారిపల్లి, కొటాల, నాగయ్యగారిపల్లి, రెడ్డివారిపల్లి మీదుగా తిరిగి ఆదివారం ఉదయం చంద్రగిరికి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో ఐతేపల్లి ఎంపిటిసి ఏసి శేఖర్, క్లాస్‌వన్ కాంట్రాక్టర్ ఏ.వి.రమణమూర్తి, మాజీ జడ్పీటిసి సరిత రమణమూర్తి ఆధ్వర్యంలో వాహన మోతదారులకు, భక్తులకు, 200 మందికి పైగా అన్నదానాలు, అల్పాహారాలు, తేనీరు వంటివి అందించారు. సుధీర్ఘ కాలంగా కొండచుట్టు రోజున ఏటా భక్తులకు ఇదేరీతిన సేవలందిస్తున్నారు. చంద్రగిరిలోనే కాకుండా ఈ గ్రామీణ ప్రాంతాల ప్రజలు కొండచుట్టును స్థానిక పండుగగా భావించి అత్యంత పవిత్రంగా జరుపుకుంటారు. ఈ కొండచుట్టు ఉత్సవాలకు వివిధ ప్రాంతాలలో స్థిరపడిన, ఉద్యోగాలకు వెళ్ళిన వారంతా తమ సొంతూరుకు చేరుకుని ఇంటిల్లపాధి ఉత్సవాలలో పాల్గొని అమ్మవారికి కర్పూర నీరాజనాలర్పించడం సంప్రదాయంగా వస్తున్నది. అమ్మవారి వాహనసేవలో పాల్గొన్న భక్తులను వీక్షిస్తే నేల ఈనిందా అన్నచందంగా పోటెత్తిన భక్తజనానికి అవసరమైన రక్షణ కల్పించడంలో పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. కొండచుట్టు ఉత్సవాలలో ఎటువంటి అపశృతులకు అవకాశం లేకుండా స్వయంగా ఎంఎల్ఏ పులివర్తి నాని పర్యవేక్షించారు.

**-డిఎస్పీ ప్రసాద్, సిఐ సురేష్‌కుమార్ పటిష్ట భద్రతా ఏర్పాట్లు**
చంద్రగిరి డిఎస్పీ ప్రసాద్ పర్యవేక్షణలో సిఐ సురేష్‌కుమార్, తిరుచానూరు సిఐ సునీల్‌కుమార్ పర్యవేక్షణలో చంద్రగిరి ఎస్ఐలు రవిశంకర్‌రెడ్డి, ప్రవళ్ళిక, అరుణాచలం, ఆర్‌సిపురం ఎస్ఐ భక్తవత్సలం, భాకరాపేట ఎస్ఐ పవన్‌కుమార్, యర్రావారిపాళ్యం లోకేష్, తిరుచానూరు ఎస్ఐ సిద్దారెడ్డి, ఎంఆర్‌పల్లి ఎస్ఐ జ్యోతి, సిబ్బంది కొండచుట్టు ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

# కుటుంబంలో విషాదం నింపిన సంక్రాంతి సంబరాలు

**-క్రికెట్ ఆడుతూ తనువు చాలించిన యువకుడు**


మృతుడు తేజ ఇన్‌సెట్‌లో ఫైల్ ఫోటో

చౌడేపల్లి, జనవరి 17 ప్రభాతవార్త: రేపో మాపో ఉద్యోగం సంపాధించి కష్టంలో వున్న కుటుంబంలో వెలుగులు నింపు తాడనుకొన్నాడా తండ్రి... పొరుగు రాష్ట్రానికి వెళ్ళి కొలువు వేటలో పడి పండగ నాడైన వచ్చి కంటారా చూసి కడుపారా తిండి పెడదామనుకొంది తల్లి...చిననాటి స్నేహితులతో కలసి ఆట పాటలాడి ఊరు జ్ఞాపకాలను మనసు నిండా నింపుకొని కొలువు సాధించి తీరుదామనుకొన్నాడా బిడ్డ... ఇలా ఎవరికెవరు ఊహల్లో తేలుతూ కుటుంబానికి మంచి రోజులు రావాలని ఆకాంక్షించారు...తామొకటి తలచితే దేవుడు మరొకటి తలుస్తాడన్న చందంగా తల్లిదండ్రుల ఆశలపై నీళ్ళు చెల్లుతూ యువకుడు అనంత లోకాలకు చేరుకొన్నాడు...హృదయ విదారకమైన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని వెంగళపల్లి పంచాయతీ పెద్దూరుకు చెందిన సహదేవరెడ్డి శక్తిక్షేత్రం బోయకొండలో పనిచేస్తున్నాడు. అతని కుమారుడు తేజ(21) పుంగనూరులోని ఎంసివి కాళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణ నిమిత్తం హైదరాబాదుకు వెళ్ళాడు. సొంత ఊరిలో సంక్రాంతి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారనీ, చిననాటి స్నేహితులతో కలసి సంబరాల్లో పాల్గొనాలనే తలంపుతో తేజ సంక్రాంతికి గ్రామానికి వచ్చాడు. సంబరాల్లో భాగంగా పాలెంపల్లి సమీపంలోని పొలంలో గత రెండు రోజులుగా క్రికెట్ టోర్నమెంటు ఆడసాగారు. శనివారం యథాప్రకారం అందరూ గ్రౌండుకు చేరుకొన్నారు. తేజ 10నంబరు జెర్సీతో ఆడుతున్నాడు. తొలుత ఫీల్డింగ్ ఎంచుకొన్నారు. స్నేహితులతో కలసి ఫీల్డింగ్ కోసం కీపర్ వెనుక భాగంలో నిల్చొని వున్నాడు. మ్యాచ్ రసవత్తరంగా సాగుతున్న తరుణంలో 5వ ఓవర్‌నందు బ్యాట్స్‌మ్యాన్ బంతిని లెగ్‌సైడ్ మీదుగా సిక్సర్ కొట్టాడు. కీపర్ వెనుకనే వున్న తేజ బాల్ బౌండరీ లైన్ దాటే క్రమాన్ని చూస్తూ ఒక్కసారిగా కుప్పకూలి పడ్డాడు. గుర్తించిన సహచర క్రికెటర్లు అతన్ని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో పుంగనూరుకు తలరించారు. అక్కడికి వెళ్ళే సరికి తేజ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఒక్కగానొక్క కుమారుడిపై ఎన్నో ఆశలు పెట్టుకొన్న కుటుంబంలో విషాదఛాయలు అలుముకొన్నాయి. చేతికందిన కొడుకు విగతజీవి అయ్యాక తల్లిదండ్రుల రోదన చూపరులను సైతం కంట తడిపెట్టించింది. అందరితో మంచిగా వుంటున్న తేజ మరణ వార్త వినగానే పెద్దూరు శోక సంద్రమైంది. కాగా మృతదేహాన్ని ఖననం నిమిత్తం సహదేవరెడ్డి సొంత గ్రామమైన మేడికుర్తికి తరలించారు. ఏది ఏమైనప్పటికీ సంక్రాంతి ఓ ఇంటి కాంతిని తీసుకెళ్ళిందని గ్రామస్తులు అనుకొన్నారు.

# భక్తులతో పోటెత్తిన కాణిపాకం ఆలయం

**-దర్శనానికి నాలుగైదు గంటలు సమయం**


భక్తుల రద్దీతో కిటకిటలాడుతున్న కాణిపాకం ఆలయం

కాణిపాకం, జనవరి 17 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి ఆలయం శనివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు, వరుస సెలవు రోజుల్లో భక్తుల రద్దీ వుంటుంది. ఈనేపథ్యంలో విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు ముగుస్తుండడం, ముక్కనుమ రోజున గోట్ నిర్వహించుకోవడం, మకర సంక్రాంతి జ్యోతి దర్శనం కోసం శబరిమల వెళ్ళిన భక్తులు తిరుగు ప్రయాణంలో పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా కాణిపాకం ఆలయ దర్శనార్థం రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు కాణిపాకం స్వామిదర్శనం కోసం భారీగా తరలి వచ్చారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప భక్తులు, తిరుమల తీర్థజనం తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. తెల్లవారుజామున నుండి రాత్రి వరకు ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు పూర్తిగా నిండిపోవడంతో ఆలయం వెలుపల భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం బారులు తీరి వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో గంటల తరబడి వేచివుండడం గమనార్హం. సర్వదర్శనం భక్తులు సమారు నాలుగు గంటలకు పైగా కూలైన్లులో స్వామివారి దర్శనం కోసం వేచివుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనితో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## తిరుపతిని రాజధాని చేయమంటే...

# రీసెర్చ్ సెంటర్ చేస్తానంటున్న సిఎం

**- మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతా మోహన్**

వెంకటగిరి, జనవరి 17 ప్రభాతవార్త: అందరికీ అనుకూలంగా ఉండే విధంగా తిరుపతి రాజధాని చేయాలని కేంద్ర మాజీ మంత్రి మంత్రి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ చింతామోహన్ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని పోలేరమ్మ గుడి ఆర్చి బెల్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభించాలని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతా మోహన్, కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. నేను తిరుపతిని రాజధాని చేయాలని అంటే చంద్రబాబు రీసెర్చ్ సెంటర్ చేయాలని అంటున్నాడని తెలిపారు. మన్నవరం బెల్ ఫ్యాక్టరీని చంద్రబాబు మాయం చేశాడు అని చెప్పారు. ఎంతోమంది నిరుద్యోగులు ఇంజనీరింగ్‌లో పీజీలు చేసి ఇళ్ల మధ్య ఉంటున్నారని తెలిపారు. దళితుల పరిస్థితి ఈ ప్రభుత్వంలో దారుణంగా ఉందని చెప్పారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో 3 వేల ఎకరాల భూమిని అమ్మాలని అనుకుంటున్నారు అని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతా మోహన్

# రప్పా...రప్పా కేసులో కేవీబీపురం సర్పంచ్ అరెస్టు


ఫైల్ ఫోటో

కేవీబీ పురం, జనవరి 17 ప్రభాతవార్త: రప్పా...రప్పా కేసులో కేవీబీపురం సర్పంచ్ కె.గిరిరెడ్డి,ని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. కేవీబీ పురం ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు... మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు సర్పంచ్ కె.గిరిరెడ్డి పొట్టేలు కోసి సీఎం జగన్ బ్యానర్‌కి రక్తం చిందించాడు. దీంతో టీడీపీ కార్యకర్త చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కె.గిరిరెడ్డిని, మురళీ (భాష), శ్రీధర్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు

## తవణంపల్లెలో పిచికుక్క వీరంగం

-పలు గ్రామాల్లో 12 మందికి తీవ్రగాయాలు

**తవణంపల్లె, జనవరి 17 ప్రభాతవార్త:** మండలంలోని పలు గ్రామాల్లో శుక్ర, శనివారాల్లో ఓ పిచ్చికుక్క వీరంగం చేస్తూ కన్పించిన వారినందరికి కరవడంతో సుమారు 12 మందికి పైగా తీవ్రగాయాలయ్యాయి. పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారినందరిని స్థానిక పీహెచ్‌సీలో వ్యాక్సిన్ వేసిన అనంతరం చిత్తూరు ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం సాయంత్రం నుండి శనివారం ఉదయం వరకు పలు గ్రామాల్లో పిచ్చికుక్క వీరంగం చేస్తూ వీధుల్లో కనపడిన వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. ఈమేరకు మండలంలోని మత్యం క్రాస్‌కు చెందిన కెవి.కస్తూరి(41), ఎం.హర్షసాయి(3), దిగువమత్యంకు చెందిన సుశీల(30), దిగువ తడకరకు చెందిన టి.దశరథన్(46)), జె.బాలాజి(40), తవణంపల్లె దాసరిపాల్యంకు చెందిన ఎం.కౌసిక్(4), ఆర్.దిలీప్‌కుమార్ (10), ఎ.సునంద ప్రియ(8), విల్వనాథశెట్టి(70), ఉత్తర బ్రాహ్మణపల్లెకు చెందిన జీవన్‌కుమార్(10), జెట్టిపల్లెకు చెందిన ఉమామహేష్ (44), మోదలపల్లెకు చెందిన పి.లక్ష్మమ్మ(65)లపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఇందులో ఆర్.దిలీప్‌కుమార్ అనే బాలుడికి నోటిలోని పళ్ళు కూడా రాలిపోయాయి. పిచ్చికుక్క అందరి ముఖాలపైనే దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గాయపడిన వారు స్థానిక పీహెచ్‌సీలో రేబిస్ వ్యాక్సిన్ వేయించుకున్న అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలి వెళ్ళారు. పిచ్చికుక్క దాడితో మండల ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. పిచ్చికుక్క కరవడం ప్రమాదకరమని, బాధితులు వైద్యుల పర్యవేక్షణలో వైద్యచికిత్సలు చేయించుకోవాలని మండల సీహెచ్ఓ జ్ఞానశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డిలు తెలిపారు. వైద్యులు సూచనల మేరకు వ్యాక్సిన్‌లు వేయించుకోవాలని వారు తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**విజయపురం, జనవరి 17 ప్రభాతవార్త:**



ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి బాధిత లబ్ధిదారులకు శనివారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా పన్నీర్‌కు చెందిన మునస్వామికి 55 వేల రూపాయలు, ఇళ్ళత్తూరుకు చెందిన రోషికవర్మకు 21,962 రూపాయలు, కలియంబాకం గ్రామానికి చెందిన ఏళుమలైకు 51 వేలు విలువగల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ లక్ష్మిపతిరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, మండల నాయకులు బాల సుబ్రహ్మణ్యంరాజు, పురుషోత్తం, లబ్ధిదారులు ఉన్నారు.

## దళితులంటే సిఎంకు చిన్నచూపు

– రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శి గాయత్రిదేవి

**చిత్తూరుహెల్త్, జనవరి 17 ప్రభాతవార్త:**



సిఎం నారా చంద్రబాబునాయుడుకు దళితులంటే చిన్నచూపు అని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శి గాయత్రిదేవి ధ్వజమెత్తారు. పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామంలో వైఎస్ఆర్‌సిపి కార్యకర్త సాల్మన్ హత్యను ఖండిస్తూ వైకాపా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శనివారం చిత్తూరు దర్గా సర్కిల్ ఆవరణలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట రాష్ట్ర వైకాపా మహిళా ప్రధాన కార్యదర్శి గాయత్రిదేవి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైకాపా మహిళా ప్రధాన కార్యదర్శి గాయత్రిదేవి, గుడిపాల మండల వైకాపా అధ్యక్షులు ప్రకాష్‌లు మాట్లాడుతూ తెలుగుదేశం నాయకుల దాడిలో వైకాపా కార్యకర్త సాల్మన్ మృతి చెందాడన్నారు. ఈ కేసులో మృతుడిపై పోలీసులు కేసు నమోదు చేయడం సంచలనంగా మారిందన్నారు. అధికార పార్టీ నాయకులకు బెదిరిపోయిన సాల్మన్ కుటుంబం ప్రక్క గ్రామంలో తల దాచుకొనే పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నగర వైకాపా అధ్యక్షులు కెపి శ్రీధర్, నాయకులు రజనీకాంత్, అన్బు, హరిషారెడ్డి, అల్తాఫ్, నౌషాద్, నవాజ్, శాంతి, అమీన్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే ఆరోగ్యం

– జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి

**యాదమరి, జనవరి 17 ప్రభాతవార్త:**



క్రీడలతోనే ఆరోగ్య సమాజం ఆవిష్కరించబడుతుందని జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలో వైకాపా యువనేత కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు శనివారం జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన క్రికెట్ జట్టు సభ్యులకు జడ్పీ వైస్ ఛైర్మన్ రూ.10,001, ద్వితీయ స్థానం దక్కించుకున్న జట్టుకు రూ.5,001లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కె.మనోహరన్, వరదరాజులపల్లి సర్పంచ్ బాలయ్య, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## బిసీ హాస్టల్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల గౌవర అధ్యక్షుడిగా షణ్ముగం

**చిత్తూరు, జనవరి 17 ప్రభాతవార్త:**



జిల్లా బీసీ సక్షమ శాఖ పరిధిలోని వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ గౌరవ అధ్యక్షుడిగా మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్, దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షులు పి.షణ్ముగం ఎన్నికయ్యారు. జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో శని వారం బీసీ సంక్షేమ హాస్టళ్ళల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సంఘ గౌవర అధ్యక్షులు పి.షణ్ముగం మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్ళి సాధ్యమైనంత మేరకు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

## ఏనుగుల దాడిలో దెబ్బ తిన్న పంటలు పరిశీలన

గుడిపాల, జనవరి 17 ప్రభాతవార్త: మండల పరిధిలోని ముత్తువాండ్లవూరు గ్రామంలో ఇటీవల ఏనుగుల గుంపు దాడి చేసిన పంటలను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు తండ్రి గురజాల చెన్నకేశవులునాయుడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు జరిగిన పంట నష్టం వివరాలను ఒక్కొక్క రైతును ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫారెస్టు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులకు ఆయన పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకుని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అధికార ప్రతినిధి తుమ్మల లలిత, నాయకులు శంకర్ చౌదరి, యోగానందం తదితరులు పాల్గొన్నారు.



# రైల్వే కోడూరు డివిజన్

## పెనగలూరులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

పెనగలూరు జనవరి 17 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం మండల కేంద్రమైన పెనగలూరు ఉన్నత పాఠశాల ఆవరణంలో శనివారం 1982 83 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. 43 సంవత్సరాల కిందట ఈ పాఠశాలలో 10వ తరగతి చదివి బయటకి వెళ్ళిన తర్వాత వివిధ రకాల ఉన్నత చదువులు చదువుకొని ప్రభుత్వ ప్రైవేటు శాఖలో ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్న వారు, ఉన్నత చదువులు చదువుకోలేక సాధారణ చదువులతోనే నిలిచిపోయిన వారు నేడు దాదాపు 60 సంవత్సరాలు వయసు వస్తున్న ఆనాటి 15 ఏళ్ల విద్యార్థులు లాగే తమ మనోభావాలు ఆత్మీయ ఆలింగనాలు అభిమానాలు ఒకరినొకరు పంచుకుంటూ ఆనంద భాష్పాలు విడిచారు. 43 ఏళ్ల తర్వాత చిన్ననాడు చదువుకున్న పాఠశాలకు వచ్చి ఆ విద్యార్థులంతా మరల ఒకటిగా చిన్నపిల్లల మనసత్వంతో మాట్లాడుకుంటూ ఒకరిపై మరొకరు నవ్వులతో జోకులు వేసుకుంటూ కాలం గడిపారు. ఈ ఆత్మీయ సమావేశానికి దేశ విదేశాలలో దూరప్రాంతాలలో ఉంటూ ఈ సమావేశం కోసం రావడం ఎంతో గొప్ప విషయమని ఒకరినొకరు కొన్ని ఆడుకున్నారు

## కుప్పంలో బలిజ కులస్తుల భారీ ర్యాలీ



కుప్పం, జనవరి 17 ప్రభాతవార్త: కుప్పం పట్టణంలో శనివారం నియోజకవర్గం లోని బలిజ కులస్తులు భారీ ర్యాలీ నిర్వహించారు .స్థానిక పాతపేట చెరువుకట్ట వద్ద నుంచి బస్టాండ్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అంతకు ముందు స్థానిక శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నుంచి పాతపేట చెరువు కట్ట వరకు బలిజ సంఘం నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా కోలాటలు వివిధ రకాల నృత్య ప్రదర్శనలు అలరించాయి. అమరావతి కాలనీ వద్ద ఉన్న రాయలవారి విగ్రహంకు బలిజ సంఘం నాయకులు ఘనంగా పూజ నిర్వహించారు.

## మిట్టపల్లిలో ఘనంగా పశువుల పండుగ

**కుప్పం జనవరి 17 ప్రభాతవార్త:**



మండలంలోని వేపూరు మిట్టపల్లి గ్రామంలో శనివారం గ్రామస్తులు పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. సుమారు 200 సంవత్సరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గ్రామస్తులు గ్రామంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు లీలా వెంకటేష్, మంజునాథ్, రఘుపతి, బాలకృష్ణ, ధన శేఖర్, కనకరాజు, దామోదర్, ఊరి గౌడు కనకప్ప, యువత పాల్గొన్నారు.

## వైకాపా తిరుగుబాటు నాయకుల సమావేశం



**శాంతిపురం, జనవరి 17 ప్రభాతవార్త:** కుప్పం నియోజకవర్గంకు చెందిన వైకాపా తిరుగుబాటు నాయ కులు శనివారం నాడు కుటేగానిపల్లిలో జడ్పీటీసీ శ్రీనివాసులు నివాసంలో సమావేశమయ్యారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ ప్రణాళిక గురించి చర్చించడం జరిగింది అని వారు తెలిపారు. పార్టీ మార్పుపై కూడా ఒకరిద్దరు మాట్లాడినట్లు తెలియ వచ్చింది. త్వరలో మరో సమావేశం ఏర్పరుచుకొని అందరూ ఏకతాటిపై నిర్ణయం తీసుకొని ముందుకు పోదామని తీర్మానం చేసుకున్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు అరెళ్ల జయప్ప, జిల్లా విద్యార్థి విభాగం మాజీ అధ్యక్షులు చీలేపల్లి రవి, మాజీ సర్పంచ్ వసనాడు మురళి, నియోజకవర్గం మహిళా నేత నీలా జగదీశ్, సోషల్ మీడియా నేతలు దాము, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## పాకాల తరలివెళ్లిన శ్రీకృష్ణ దేవరాయ కమిటీ సభ్యులు



**సోమల, జనవరి 17 ప్రభాతవార్త:** శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శనివారం మధ్యాహ్నం జరుగుతుండడంతో సోమల నుంచి పలువురు తరలి వెళ్లారు. సోమల బస్టాండ్ నుంచి శ్రీకృష్ణదేవరాయ కమిటీ సభ్యులు వివిధ వాహనాల్లో శనివారం ఉదయం తరలి వెళ్లారు. అలాగే చౌడేపల్లి పుంగనూరు నుంచి వచ్చిన వాహనాలతో కలిసి వారు పాకాల తరలి వెళ్లారు

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**చౌడేపల్లి, జనవరి 17 ప్రభాతవార్త:**



గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు...మండలంలోని పంచాయతీ కేంద్రం పరికిదొనకు చెందిన కొమ్ము శ్రీనివాసులు(52)కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో సొంత పనిమీద చౌడేపల్లికి వచ్చాడు. ఇక్కడ పనిముగించుకొని రాత్రి బస్సులో బయలుదేరాడు. చౌడేపల్లి-తిరుపతి ప్రధాన రహదారిలో శింగిరిగుంట స్టేజీవద్ద బస్సు దిగి నడుచుకొంటూ వెళ్ళాడు. వెనుకనే గుర్తు తెలియని వాహనం శ్రీనివాసులును ఢీకొని వెళ్ళి పోయింది. తలకు బలమైన గాయమై అతను రోడ్డు మీద పడ్డాడు. గుర్తించిన వాహన దారులు పోలీసులకు సమాచారమందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న అతన్ని పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శ్రీనివాసులు మృతి చెందాడు. మృతుని భార్య ఓబులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృత దేహాన్ని అక్కడే పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## పలగార్లపల్లిలో అగ్ని ప్రమాదం : రూ.లక్ష ఆస్తినష్టం

**చౌడేపల్లి, జనవరి 17 ప్రభాతవార్త:**



మండలంలోని కాగతి పంచాయతీ పలగార్లపల్లిలో అగ్ని ప్రమాదం సంభవించి రూ.లక్ష వరకు ఆస్తినష్టం సంభవించిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధితురాలి కథనం మేరకు... పలగార్లపల్లికి చెందిన రెడ్డెమ్మ ఐసిడిఎస్‌లో ఆయాగా పనిచేసుకొంటూ పూరిగుడిసెలో నివసిస్తోంది. ఆమె కుమారుడు ఆన్‌లైన్‌లో ఉద్యోగ అన్వేషణలో వున్నాడు. ఈమేరకు అతనికున్న ల్యాప్‌ట్యాప్‌ను ఇంట్లో ఛార్జింగ్‌కు వుంచాడు. శుక్రవారం రాత్రి అందరూ సంక్రాంతి సంబరాల కోసం ఊరి బయటకు వెళ్ళారు. ఆ సమయంలో గుడిసెల్ ఏర్పడ్డ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ మూలంగా గుడిసె నుంచి మంటలు చెలరేగాయి. గుర్తించిన గ్రామస్తులు మంటలను అదుపు చేసారు. అప్పటికే ఇంట్లో వున్న రూ. 50వేల నగదు, ల్యాప్‌ట్యాప్, నిత్యావసర సామాగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయని బాధితురాలు వాపోయింది. మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) బాధితురాలికి ఆర్థికసాయం చేసారు.

## వైద్య సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి : లోకనాథం

**చౌడేపల్లి, జనవరి 17 ప్రభాతవార్త:**



వైద్య సేవల్లో భాగంగా ప్రభుత్వాలందించే సంక్షేమ పథకాలను గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నమయ్య జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవాట్రస్టు కోఆర్డినేటర్ డాక్టర్ లోకనాథం అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలోని 108, 104సేవలందించే వాహనాలు, సంబంధిత రికార్డులను ఆయన తనికీ చేసారు. అనంతరం 108, 104 వాహనాల్లో సాంకేతిక విషయాలు, రికార్డులను ఆయన తనిఖీ చేసారు. గణేష్, ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బలిజ : కాపులకు సీఎం అన్ని విధాలా అండ : ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, జనవరి 17 ప్రభాతవార్త:**



రాష్ట్రంలోని కాపు, బలిజలకు సీఎం చంద్రబాబు నాయుడు అన్ని విధా లా అండగా ఉంటున్నారని ప్రభుత్వ విప్, కడ పిఎసి చైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం కుప్పం పట్టణం లో శ్రీకృష్ణదేవరాయల బలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల 555వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుప్పం బస్టాండులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని ప్రసంగించారు. ఇంతవరకు సీఎం చంద్రబాబు నాయుడు పై కాపు, బలిజలు చూపిన ప్రేమాభిమానాలు మరువలేనివన్నారు. ముమ్ముందు కూడా కాపు, బలిజ కులస్తులు సీఎం చంద్రబాబు నాయుడు కోసం కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. బలిజ కమ్యూనిటీ భవనం కోసం 2.46 ఎకరాల విలువైన భూమిని కేటాయించారని అన్నారు. అక్కడే ప్రహరీ గోడ నిర్మాణానికి కడ ద్వారా 36 లక్షల నిధులు మంజూరు చేయగా ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికె ఎమ్ ఉడా చైర్మన్ సురేష్ బాబు ,బలిజ సంఘం అధ్యక్షుడు గోపీనాథ్ ,సంఘ నాయకులు ప్రభాకర్, సత్యేంద్ర శేఖర్, మంజునాథ్, ఆర్ఆర్ రవి, డీలర్ వెంకటేష్, చలపతి, వెంకటేష్, అశోక్ ,నాలుగు మండలాల బలిజ సంఘం నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వికసితభారత్‌తో విప్లవాత్మక మార్పులు

**పుంగనూరు జనవరి 17 ప్రభాతవార్త :**




ఉపాధి పథకం స్థానంలో కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీ విక మిషన్ గ్రామీణ పథకంతో ప్రజల జీవితాలలో విప్లవాత్మక మార్పులు వస్తాయని భాజపా రాష్ట్ర మైనారిటీ నాయకులు పి అయూబ్ ఖాన్ అభిప్రాయపడ్డారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా రూపొందించిన ఈ చట్టం తో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారుతా యన్నారు. ఉపాధి పనిదినాలను వంద నుంచి 125కు పెంచడమే, ప్రజల జీవనోపాధులు మెరుగు పర్చి ఆస్తులను సృష్టించడానికి వెసులుబాటు ఉంటుందన్నారు. కోట్ల మంది ప్రజలకు పథకంతో కొత్త పథకంతో ఎంతో మేలు చేకూర్చడం తోపాటు అవినీతి అక్రమాలు పూర్తిగా నిర్మూలన చేయవచ్చన్నారు.

## ఎరుకుల అధ్యక్షులుగా బాబు, విజయ్

**పుంగనూరు రూరలజనవరి 17 ప్రభాతవార్త:**



పట్టణ మండల ఎరుకల సంఘ అధ్యక్షు లుగా బాబు, విజయకుమార్ నియమి తులయ్యారు. రాష్ట్ర ఎరుకుల సంఘం శనివారం కమిటీలను ఏకగ్రీవంగా నియ మించింది. రాష్ట్ర అధ్యక్షుడు సాకే చిరంజీవి, జిల్లా అధ్య క్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో సమావేశం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడుగా మర్రిమాకులపల్లె బాబు ను, మండల అధ్యక్షుడుగా విజయకుమార్‌ను ఎన్నుకున్నారు. చిత్తూరు జిల్లా పెద్ద పంజాణి మండల అధ్యక్షుడుగా శ్రీనివాసులును, అన్నమయ్య జిల్లా రామ సముద్రం మండల అధ్యక్షుడుగా ఎరుకుల ఈశ్వరప్పను, మహిళా అధ్యక్షురాలుగా ఎరుకుల అలివేలమ్మను ఎన్నుకున్నారు. ఎరుకుల కులస్తుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు.

## శ్రీ కోదండ రామస్వామికి విశేష పూజలు

**పుంగనూరు రూరల్, జనవరి 17 ప్రభాతవార్త:**



మేలుపట్లలో వెలసిన శ్రీ కళ్యాణ కోదండ రామస్వామి ఆలయంలో ధనుర్మాసం చివరి శనివారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. స్వామివారికి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమయ్యాయి. సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల మూలవర్లకు ఫల పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్వామివారిని శోభాయమానంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. స్వామివారికి మహా మంగళహార తులు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రప్ప, రోహిత్‌రెడ్డి, అభివర్షిత్‌రెడ్డి, హరి, లోకి గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల కోసం ఆందోళ!

**పుంగనూరు, జనవరి 17 ప్రభాతవార్త:**



మండలంలోని ఈసీఎల్ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు శనివారం ఉదయం పరిశ్రమ ప్రధాన గేటు వద్ద నిరసన చేపట్టారు. పరిశ్రమలో స్థానిక యువతను పక్కనపెట్టి ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారికి మాత్రమే ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇస్తున్నారని నిరసనకారులు ఆరోపించారు. పరిశ్రమ స్థాపన కోసం తమ భూములను కేటాయించినప్పటికీ, స్థానికుల పట్ల పరిశ్రమ యాజమాన్యం నిరక్ష ్యంగా వ్యవహరిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భూములు ఇచ్చిన కుటుంబాలకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత పరిశ్రమదేనని పేర్కొంటూ, స్థానిక యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసన విషయం తెలుసుకున్న పరిశ్రమ మేనేజర్ జయదేవ్ సేనాపతి సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో చర్చలు జరిపారు. మేనేజర్ ఇచ్చిన హామీతో స్థానికులు నిరసనను విరమించారు.

## వ్యక్తి దారుణ హత్య!

**శాంతిపురం, జనవరి 17 ప్రభాతవార్త:**



శాంతిపురం మండలం తిమ్మరాజు పల్లికు చెందిన చంద్ర(26)ను అతి దారుణంగా హత్య చేయడం జరిగింది .ఈ సంఘటన కు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. చంద్ర జీవనోపాధి కోసం బెంగళూరులో కూలి పని చేస్తూ ఉండేవాడని అయితే సంక్రాంతి పండుగకు సొంత గ్రామమైన తిమ్మరాజు పల్లి కి వచ్చాడని తెలిపారు .అయితే శనివారం మధ్యాహ్నం గొర్రెలు మేపే వాళ్లు మోడల్ స్కూల్ సమీపంలోని కొలిమిగుట్ల వద్ద ఎవరో మృతి చెంది ఉన్నారని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కుప్పం డి.ఎస్.పి పార్థసారథి, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, రాళ్ళ బూదు గూరు ఎస్సై నరేష్ హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతి నుండి ఫోరెన్సిక్ అధికా రులు వచ్చిన తర్వాత మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలిస్తారని తెలిపారు. అయితే మృతుని పక్కన మద్యం సీసాలు ఉన్నాయి. మద్యం సేవించిన తర్వాత ఏమైనా గొడవలు జరిగాయా అనే విషయంతెలియాల్సి ఉంది. మృతునికి తలపై, ముఖంపై గాయాలు తీవ్రంగా అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాతీయ రహదారిపై మృతుడి బంధువులు ధర్నా

**శాంతిపురం, జనవరి 17 ప్రభాతవార్త:**

మండలం లోనితిమ్మరాజు పల్లి కి చెందిన చంద్ర (26) హత్యకు గురికాగా తిమ్మరాజుపల్లి గ్రామస్తులు, బంధువులు ఏడవ మైలు సమీపంలోని జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారో కో చేపట్టారు. పోలీసుల అదుపులో బీరనకుప్పంకు చెందిన ఉదయ్ ఉన్నాడని అతనితో పాటు చాలామంది కలిసి చంద్రను హత్య చేశారని ఆగ్రహం వ్యక్తం చేసారు. వెంటనే వారిని కూడా అరెస్ట్ చేయాలని ధర్నా, రాస్తారోకో చేపట్టారు ఇంతలో రాళ్ళ బూదుగూరు పోలీసులు కలుగజేసుకొని విచారణ చేపడుతు న్నామని నచ్చచెప్పి ధర్నాను విరమింప చేశారు. అయితే తిమ్మరాజు పల్లి గ్రామస్తులు బీరనకుప్పం ఉదయ్ ఇంటిపై దాడి చేసి వస్తువులను చిందర వందర చేసారు .

## లయన్స్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవం

**రామకుప్పం, జనవరి 17ప్రభాతవార్త:**



రామకుప్పంలో లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవం ఎన్నుకున్నారు. శనివారం స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులుగా సత్యనారాయణ శెట్టి, కార్యదర్శి ఉమామహేశ్వరరాజు, కోశాధికారిగా రతన్ లాల్, సేవా కమిటీ చైర్మన్ , పీవి సీతాపతి, సభ్యులు ఇంద్ర ప్రకాష్ రెడ్డి, ఆర్ ఎన్ విజయకుమార్, ఎస్ కే రవి, మన్సూర్, హరీష్, కమలనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా రవికుమార్, విశ్వనాథ్, అడ్మిన్ కమిటీ చైర్మన్ వేణుగోపాల రాజును ఎన్నుకున్నారు. మండలంలోని గ్రామాల్లో పేద ప్రజలకు, విద్యార్థులకు నిస్వార్థ సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేస్తామన్నారు.

## బిబిజి ఉచిత రిజిస్ట్రేషన్

తిరుపతి,జనవరి 17(ప్రభాతవార్త:

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో బిబిజి సంక్రాంతి పండుగ వేళ తమ వినియోగదారులకు సంతోషకరమైన కానుకలను ప్రకటించింది. ఉచిత రిజిస్ట్రేషన్ నుండి ఉచిత ప్లాట్ వరకు నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో భారీ లక్కీడ్రా జరిపించి విజేతలను ప్రకటించింది. బిబిజి (కాజా),చలివేంద్రపాళెం, కొండపావులూరులలో ప్లాట్లు కొనుగోలుచేసిన మొదటి వందమంది ఖాతాదారుల నుండి లక్కీడ్రా తీశారు. ఈ డ్రాలో బిబిజి ఛైర్మన్ ఎంవి మల్లికార్జునరెడ్డి నుండి 30లక్షలు విలువైన ప్లాట్‌ను ఉచితంగా అందజేశారు. 99మంది ప్లాట్ యజమానులకు పదివేల గిఫ్ట్‌కూపన్‌లను బహుమతిగా లభించడం సంతృప్తినిచ్చింది. 16వతేదీ వరకు కొత్తగా ప్లాట్ కొనుగోలు చేస్తే ఉచిత రిజిస్ట్రేషన్ , నిర్ణీత గడువులోపు ప్లాట్ బుక్‌చేసుకుంటే 55అంగుళాల ఎల్ఈడి టివిఉచితంగా అందజేయనున్నారు. సామాన్యులకు సొంత ఇంటి కల సాకారం చేయాలనేది బిబిజి ఆశయమన్నారు.

## పురవీధులు గోవిందనామాలతో ప్రతిధ్వనింపు

తిరుపతి,జనవరి 17 ప్రభాతవార్త:




ఆధ్యాత్మికనగరం తిరుపతి శనివారం వేకువజామున గోవిందనామస్మరణతో ప్రతి ధ్వనించింది. తిరుపతి ప్రజల్లో భక్తిభావం పెంపొందింపజేసేందుకు ప్రతి శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన యాత్రికుల్లో ,నగరవాసుల్లో మరింత ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చేస్తోంది. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కళాకారులు తొండడమనాటి సుబ్రమణ్యంరెడ్డి, వాసుదేవరెడ్డి, సుకుమార్‌రెడ్డి, కస్పాపద్మనాభం, మురళి, మధు, చంద్రబాబు నాయుడు, పలని ఆచారి, పొన్నాలజేజిరెడ్డి, పద్మావతి, శ్రావణి, ఉష,విగ్రహాల కళ్యాణి, సిద్దమ్మ, అరుణ,జయమ్మ, మునేంద్రరెడ్డి, రెడ్డిబాబు, కల్పన తదితర కళాకారులు తిరునామం ధరించి తప్పెటతాళాలతో వాయిద్యాలతో భజనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో కదిలారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## చోరీకేసులో నిందితుడి అరెస్టు!

పెద్దపంజాణి, జనవరి17 ప్రభాతవార్త:



మండలంలోని ముత్తుకూరు గ్రామంలో నివాసముంటున్న జబీఉల్లా ఇంట్లో ఈనెల 10వతేదీ జరిగిన చోరీకేసుకు సంబందించి నిందితున్ని అరెస్టుచేసినట్లు ఎస్సై మారెప్ప తెలిపారు.జబీఉల్లా ఈనెల 10వతేదీ తన కుటుంబీకులతోకలసి బెంగుళూరులో బందువుల వివాహ వేడుకకు వెళ్ళారు.11వ తేదీ ఇంటికి వచ్చిచూడగా తలుపులు తెరచి ఉండటంతో పాటు బీరువా తెరచి ఉండటం బీరువాలోఉన్న బంగారు,వెండి నగలు చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితుడు ఫిర్యాదు చేశారన్నారు.ఈకేసువిషయంగా గ్రామంలో విచారించగా ముత్తుకూరు గ్రామానికి చెందిన సుహేల్‌భాషా చోరీకి పాల్పడినట్లు తేలిందన్నారు. శనివారం నిందితుడు ముత్తుకూరు క్రాస్‌వద్ద అనుమానస్పదంగా తిరుగుతుండటంతో అతన్ని అదుపులో తీసుకుని విచారించగా చోరీచేసిన విషయం బయటపడిందన్నారు. నిందితుని వద్దనుంచి 14గ్రాముల బంగారునగలు, 250గ్రాముల వెండినగలు స్వాదీనంచేసుకున్నట్లుచెప్పారు.నిందితున్నిరిమాండునిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు ఆయనతెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

బాకరాపేట,జనవరి17 ప్రభాతవార్త:



దేవరకొండ బాకరాపేట మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు భాకరాపేట ఎస్సై రాజా పవన్ కుమార్ తెలిపారు ఎస్సై తెలిపిన వివరాల మేరకు చిన్నగొట్టిగల్లు మండలం మైలా వాండ్లపల్లికి చెందిన షేక్ సుల్తాన్ (15), లోకేష్‌లు ద్విచక్ర వాహనంలో భాకరాపేట వైపు వస్తున్నారు. అదే సమయంలో భూతంవారిపల్లి చెందిన పవన్ కుమార్ దేవరకొండ వైపు నుండి చిట్టే చర్ల వైపు ట్రాక్టర్ నడుపుకుంటూ వస్తున్నారు. బోడి రెడ్డి గారి పల్లి బస్ స్టాప్ సమీపంలో రెండు వాహనాలు ఢీకొనడంతో షేక్ సుల్తాన్ తలకు తీవ్ర గాయం అయింది లోకేష్ కు కుడి చేయి విరిగిపోయింది వీరిని 108 లో తిరుపతి రుయా ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ షేక్ సుల్తాన్ మృతి చెందినట్లు తెలిపారు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

## గజరాజుల దాడిలో మామిడి చెట్లు ధ్వంసం

భాకరాపేట,జనవరి17 ప్రభాతవార్త:



అటవీ సరిహద్దు ప్రాంతంలోని దేవరకొండ, చిట్టెచర్ల పంట పొలాలపై గజరాజులు గత రెండురోజుల నుండి దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి శుక్రవారం రాత్రి దేవరకొండ పంచాయతీ మల్లెల వాండ్లపల్లికి చెందిన శంకరమ్మ మామిడి తోటలో మామిడి చెట్లను విరిచేసాయి సుమారు పది సంవత్సరాల పైబడిన చెట్లు పుత బాగా వస్తున్న సమయంలో ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఏనుగులుపంట పొలాల వైపు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు

## ఘనంగా ఎమ్జీఆర్ జయంతి

చిత్తూరుహెల్త్, జనవరి 17 ప్రభాతవార్త:




తమిళనాడు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు ఎంజి రామచంద్రన్ 109వ జయంతి వేడుకలను శనివారం చిత్తూరు నగరంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్జీఆర్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని సంతపేట, తోటపాళ్యం ప్రాంతాల్లో ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సంతపేట, తోటపాళ్యం ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్జీఆర్ అభిమాన సంఘ నాయకులు పోలీస్ కంద, విజయకుమార్, దేవాలు మాట్లాడుతూ ఎమ్జీఆర్ తన నటనతో కోట్లాది అభిమానుల అభిమానంను చురగొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మురుగ, ఎంజీఆర్ అభిమాన సంఘ నాయకులు త్రిమూర్తి, శంకర్, ఈశ్వర్‌బాబు, వేలు, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శుభకార్యాలకు డీజే ఏర్పాటు చేసే వారు...పోలీసుల అనుమతి పత్రం తప్పనిసరి



ఓబులవారిపల్లి జనవరి 17 ప్రభాతవార్త:

ఓబులవారిపల్లి మండలంలో జరుగుతున్న సంక్రాంతి పండుగ గొబ్బెమ్మ మరియు భజన కార్యక్రమాలకు శుభ కార్యక్రమంలో డీజే. మైకులు ఇతరత్రా కార్యక్రమాలు జరుపుకునేటప్పుడు గ్రామపంచాయతీ నాయకులు ప్రజలు పోలీస్ స్టేషన్లో వినతి పత్రం సమర్పించి ఆ తర్వాత డీజే కావాలని పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఓబులవారిపల్లి ఎస్సై నాయుడు తెలిపారు . ఈ సందర్భంగా ఆయన ప్రజలకు తెలియజేయడం ఏమనగా డీజే మ్యూజిక్ల వల్ల తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని అలాగే హార్ట్ పేషెంట్ ఇతరత్రా వ్యాధులు ఉన్నవారు ఇబ్బందులకు గురువు కావడమే కాకుండా గ్రామాల్లో ఘర్షణలు వాతావరణం కు దావిస్తుందని దూల ప్రతి ఒక్కరు పోలీసుల అనుమతి సూచనలు సలహాలు పాటించాలని లేనియెడల . చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు

## తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, జనవరి 17 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారు విశేష అలంకృతులై తిరుచ్చి వాహనంపై అధిష్టించి తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఇఓ ఎం.గోపినాధ్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అసిస్టెంట్ బైరెడ్డి హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్న వెంకటేశ్వరునికి ఊంజల్‌సేవ

వడమాలపేట, జనవరి 17 ప్రభాతవార్త:



అప్పలాయగుంటలో అభయహస్తంతో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి వారికి శనివారం ఊంజల్‌సేవ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్య కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుదీర్చగా గంట పాటు సిద్విలాసంగా ఊయలలుగుతూ స్వామివారి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన స్వామివారు మాడవీధుల్లో విహరించారు.భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, అర్చకులు రమణాచార్యులు, తిప్పయాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## రాబోయే గిరిప్రదక్షిణలో వాహనాలు నిషేధం :ఇఓ

శ్రీకాళహస్తి,జనవరి 17 ప్రభాతవార్త:



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఇఓ డి.బాపిరెడ్డి శనివారం వివరించారు. శుక్రవారం నిర్వహించిన గిరి ప్రదక్షిణలో తాము స్వయంగా పాల్గొని పలు సమస్యలను గుర్తించినట్లు ఆయన వివరించారు.భక్తులు ఎంతో ప్రశాంతంగా భక్తి భావంతో గిరి ప్రదిక్షణ చేస్తుంటే ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు గుర్తించినట్లు వివరించారు. కొందరు యువకులు ద్విచక్రవాహనాలపై భయభ్రాంతుల్ని చేస్తూ ఎక్సిలేటర్లను రైజ్ చేస్తూ మరి కొందరు భయంకరంగా హారన్లను మోగిస్తూ ఇబ్బంది కల్గిస్తున్నట్లు గుర్తించినట్లు వివరించారు. అలాగే కార్లు, ఆటోలతో కాలినడక భక్తులకు ఇబ్బందిగా మారిందన్నారు. కాబట్టి మధ్యాహ్నం వరకు వాహనాలను నిషేధించినట్లు వివరించారు. మధ్యాహ్నం తరువాత వాహనాలను అనుమతిస్తామన్నారు. తెలుగుగంగ మండపం వద్దనే వాహనాలను కట్టడి చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు.కాగా ప్రస్తుతం రెండవ గోపురం వద్ద అన్ని సేవా టిక్కెట్లు కౌంటర్లును ఏర్పాటు చేసినట్లు రాబోవు రోజుల్లో ఇక్కడే రూ.200 ప్రత్యేక దర్శనం టిక్కెట్లుతో పాటు అంతరాలయ దర్శనం టిక్కెట్లు రూ.500లకౌంటర్ కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

## శివయ్య సేవలో కొడాలి నాని

శ్రీకాళహస్తి,జనవరి 17 ప్రభాతవార్త:



మాజీమంత్రి కొడాలి నాని శనివారం శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు.వారికి వైకాపా శ్రేణులు ఘనస్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న ఆయనకు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలనుఅ ఒదించారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర వైకాపా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బుల్లెట్‌శ్యాం రాయల్,మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు మున్నారాయల, అమ్మపాళెం, మహాదేవ, యుగంధర్, యూకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రధానం

శ్రీకాళహస్తి,జనవరి 17 ప్రభాతవార్త:




శ్రీకాళహస్తిలోని యువ క్రీడాకారులను ప్రోత్సహించుటకు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తమ వంతు కృషి చేస్తున్నారని శనివారం బొజ్జల బృందమ్మ అన్నారు. ఇక్కడ సంక్రాంతి కానుకగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమాలకు బృందమ్మ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చెడుమార్గాలకు దూరంగా ఉండాలని క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని అన్నారు.ఈ టోర్నమెంట్‌ను సంకల్ప స్పోర్ట్స్ అకాడమి నిర్వహించగా ఎంస్టోర్స్ ఫ్యాషన్ మాల్ స్పానర్సర్‌గా వ్యవహరించటం సంతోషంగా ఉందన్నారు. ఐదురోజుల పాటు సాగిన టోర్నమెంట్‌లో శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన 48జట్లు పాల్గొనగా పోటాపోటీగాపాల్గొన్నారని ఫైనల్ మ్యాచ్‌లో ఎయిర్ ఫోర్స్ జట్టు విజేతగా నిలిచారని సుబ్బు సిక్సర్స్ జట్టు రన్నర్‌గా నిలించింది.విన్నర్స్‌కు రూ.10వేలు, రన్నర్స్‌కు రూ.5వేలు నగదు బహుమతులను అందించారు.ఫైనల్ మ్యాచ్‌లో అధ్భుత ప్రతిభ కనపరచిన ఇర్ఫాన్(ఎయిర్‌పోర్సు జట్టు)కు మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందించారు. టోర్నమెంట్ మొత్తంలో అత్యుద్భుతమైన కనబరచిన రోషద్(సుబ్బు సిక్సర్స్)కు మోస్ట్ వాల్యూవబుల్ ప్లేయర్ అవార్డు దక్కింది. ఈ కార్యక్రమాల్లో ఆమెతో పాటు మాజీ కౌన్సిలర్ బి.రేణుకాదేవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు,మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ చెంచయ్యనాయుడు పార్టీ ముఖ్యులు పాల్గొన్నారు.

## పరామర్శ... ఓదార్పు

శ్రీకాళహస్తి,జనవరి 17 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి పట్టణంలోని 9వ వార్డు గాండ్ల వీధికి చెందిన కర్లపూడి కళ్యాణ్ అనారోగ్యంతో మృతి చెందటంతో ఆయన పార్థీవ దేహానికి బొజ్జల బృం దమ్మ నివాళులర్పించారు. వారికి కుటుం బాన్ని ఓదార్చరు. తెలుగుదేశం కుటుంబ బాలకు బాధ కల్గితే ఆదుకుంటామని ఆమె వివరించారు. ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సహాయం అందిస్తుందని వివరించారు. ఆమెతో పాటు పార్టీ పట్టణ అధ్యక్షుడువిజయకుమార్‌నాయుడు,చంద్ర,వరుణ్,ధారాపాండు,తెలుగుదేశం పార్టీనాయకులు పాల్గొన్నారు.

## రూమ్‌బాయ్ ఆత్మహత్య!

తిరుపతి,జనవరి 17ప్రభాతవార్త:

తిరుపతిలో ఓ హోమ్‌స్టేలో రూమ్‌బాయ్‌గా పనిచేస్తున్న జె.తులసీరామ్(25) ఇంట్లో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అలిపిరి పోలీసులు తెలిపారు. ఎస్‌ఎన్‌పురంలో నివాసముంటున్న ఇతను ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్యభర్తల మధ్య వివాదంతో ఒంటరిగా ఉంటున్నాడు. అయితే ఏం జరిగిందో ఏమోగానీ శనివారం ఉదయం ఇంట్లోనే మృతిచెందాడని అలిపిరి ఎస్ఐ శ్రీవాణి తెలిపారు. మృతుని భార్య తండ్రిపై అనుమానం వ్యక్తంచేసిన మృతుని సోదరుడు జోషి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# తిరుపతి డివిజన్

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఎంపీడీవో

కేవీబీ పురం, జనవరి 17 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన కేవీబీ పురంలో శనివారం ఉదయం పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం అమ్మవారి వీధిలో సిమెంటు నిర్మాణ పనులను, వేసిన చెత్తాచదారాన్ని శుభ్రం చేయించారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపైన ఎలాంటి మురికి నీటిని వదలకూడదని సంబంధిత దుకాణ దారులకు ఎంపీడీవో తెలిపారు. మండల కేంద్రం పారిశుధ్య పనుల్లో ఆదర్శంగా నిలవాలని ఆమె పారిశుధ్య కార్మికులకు సూచించారు.

## పల్లెలను కమ్మేసిన పొగ మంచు

కేవీబీ పురం, జనవరి 17 ప్రభాతవార్త:



కేవీబీ పురం పల్లెలను శనివారం ఉదయం కూడా పొగ మంచు కమ్మేసింది. ప్రయాణికులు ఈ పొగ మంచు వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్రవాహనాలు, కార్ల ప్రయాణం ఎదురుగా ఏమి కనపడడం లేదని, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పొగ మంచు వల్ల బయటకు రావడానికి భయ పడుతున్నారు. మంచు తెర తీసే వరకు ప్రయాణాలు ఆపుకుని 10 గంటల తరువాత ప్రయాణిస్తున్నారు.

## శ్రీకృష్ణదేవరాయల విగ్రహా అవిష్కరణ మహోత్సవం

పాకాల, జనవరి 17 ప్రభాతవార్త:



పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహా అవిష్కరణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహా ఆవిష్కరణ మహోత్సవానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరైనారు. ముందుగా పాకాల పట్టణంకు చేరుకున్న ఎమ్మెల్యేకు కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని జనసేన జిల్లా పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలసి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆవిష్కరించారు. పాకాల పట్టణంలో దేశాన్ని పాలించిన గొప్ప నాయకుల విగ్రహాలు స్థాపించడం జరిగిందని వారి విగ్రహాలతో పాటు చంద్రగిరి నియోజకవర్గంలో మొదట శ్రీకృష్ణదేవరాయల విగ్రహా ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది అని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టీల కోసం పోటెత్తిన యువత

–ఉత్కంఠ భరితంగా జల్లికట్టు

చంద్రగిరి, జనవరి 17 ప్రభాతవార్త:



పట్టీలను ఒడిసిపట్టేందుకు చేసుకునేందుకు పోటెత్తిన యువత పోట్లగిత్తలతో పోరాటం చేశారు. సంక్రాంతి సంబరాలలో అరుదైన ఘట్టం పశువుల పండుగను గ్రామీణ యువత ఉత్సహాంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా శనివారం మండల పరిధిలోని మండపం పల్లి, దోర్నకంబాల, మల్లయ్యపల్లి గ్రామాలలో జల్లికట్టు సంబరాలను వైభవంగా నిర్వహించారు. పాడి రైతు ఎద్దుకు కట్టిన పట్టీని కైవసం చేసుకునేందుకు పోటెత్తిన పౌరుషంతో యువకులు పోరాటమే చేశారు.జల్లికట్టు సంబరాలకు పెద్దఎత్తున పాడి ఆవులను, ఎద్దులను ముస్తాబు చేశారు. ఏడాదికి ఒకమారు పాడిరైతులు జరుపుకునే పశువుల పండుగ రోజున ఏరువాకలో తమకు చేదోడుగా నిలిచి పండిన పంటలను ఇంటికి చేర్చే కాడెద్దులకు పూజలు జరిపించి వాటిలోని ఉత్సాహాన్ని, పౌరుషాన్ని వెలికితీయడమే లక్ష్యంగా జల్లికట్టు సంబరాలు నిర్వహించారు. ఈ క్రమంలో పలువురికి గాయాలయ్యాయి.

## ప్రత్యేక అలంకరణలో శ్రీ మూలస్థాన ఎల్లమ్మ

రామచంద్రాపురం, జనవరి 17 ప్రభాతవార్త:



ముక్కనుమను పురస్కరించుకుని నెత్తకుప్పం గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారిని శనివారం ఆలయ అర్చకులు మోహన ఆచారి ప్రత్యేక అలంకరణలతో తీర్చిదిద్దారు. ఉదయాన్నే అమ్మవారికి వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. తదుపరి సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో అమ్మవారిని విశేష అలంకరణలతో తీర్చిదిద్దారు. ఆనవాయితీ ప్రకారం అమ్మవారిని నెత్తకుప్పం, నెత్తకుప్పం హెచ్‌డబ్ల్యు, ఏఎడబ్ల్యు, పార్వతీపురం, జయరామ్ నగర్, పాలమాకులపల్లి, ఎల్వీపురం గ్రామాలలో కొండచుట్టు మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు నారికేళ, కర్పూర హారతులతో నీరాజనాలర్పించారు.

## జలకంఠేశ్వర స్వామి వారి ఆలయంలో రమ్యానంద

రామచంద్రాపురం, జనవరి 17 ప్రభాతవార్త:

రాయలచెరువు కట్ట క్రింద వెలసియున్న శ్రీ జలకంఠేశ్వర స్వామి వారి ఆలయాన్ని శనివారం శ్రీశక్తిపీఠాదేశ్వరీ, మంత్ర మహేశ్వరీ రమ్యానంద భారతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు ఆమెకు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని శ్రీఆంజనేయ స్వామి వారికి, భవానీ శంకరునికి, దక్షిణామూర్తికి, సుబ్రమణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# జనసంద్రంగా... నాయుడుపేట స్వర్ణముఖినది



నాయుడుపేట, జనవరి 17 ప్రభాతవార్త: పేటలో శనివారం సాయంత్రం ఏటి పండుగ మహోత్సవం సందర్భంగా స్వర్ణముఖి నదిలో జనసంద్రోహం కోలాహలం రెండవ రోజుకు చేరుకుంది. స్వర్ణముఖి నది తీరంలో ప్రతి ఏడాది ఆనవాయితీగా సాంప్రదాయబద్ధంగా ఆధ్యాత్మికంగా సమైక్యతకి నిదర్శనంగా జరిగే ఏటి పండుగ ఈసారి కూడా అత్యంత వైభవంగా రెండవ రోజు వేలాదిమంది జన సమూహం మధ్య అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాల్గొన్న సూళ్లూరుపేట నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయ శ్రీ, పార్థసారథి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్ విచ్చేశారు. ఈ పండుగ దినాలలో మనమంతా మూడు రోజులపాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో నృత్యాలు, సినీ నృత్యాలు, సందడిలో అక్క చెల్లెమ్మలు. అన్నదమ్ములు సంతోషంగా ఉండాలని మీ అందరి కోసం ఈ కార్యక్రమాన్ని ఇంత వైభవంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం నిషి ఈవెంట్స్ హరి అధ్యక్షతన అద్భుతంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు సినీ పాటలకు డాన్సులు ప్రదర్శించి ఏటి పండుకు విచ్చేసిన అశేష ప్రజలని ఆకర్షిస్తూ జబర్దస్త్ టీం తన్మయి, మరియు అవినాష్,



పల్సర్ బైక్ రమణ, డి టీం రాజు తదితరులు అశేష జన హృదయాలను మైమరిపించేలా చప్పట్లు సరిచేలా నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షత వహించిన మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, దేశం పార్టీ యువ నాయకులు నెలవల రాజేష్, జనసేన నాయకులు ప్రవీణ్ కుమార్, ఉగ్గుముడి భాస్కర్ రెడ్డి, కట్టా వెంకటరమణారెడ్డి, చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు చేవూరు చెంగయ్య, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా మున్సిపల్ మేనేజర్ ఊరుకుందమ్మ, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం

ఓజిలి, జనవరి 17 ప్రభాతవార్త: ఓజిలి టీడీపీ కార్యాలయంలో ఆదివారం దివంగత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమం జరుగుతుందని ఆ పార్టీ నాయకులు శనివారం తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఓజిలి మండలంలోని తెలుగుదేశం, భారతీయజనతా పార్టీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలకు ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు.

## గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయశ్రీ



పెళ్లకూరు, జనవరి 17 ప్రభాతవార్త: మండలంలోని తల్వాయిపాడు గ్రామంలో వెలిసియున్న స్వయంభు శ్రీవీర్లయ్యస్వామి మహాలక్ష్మి అమ్మవార్ల గ్రామోత్స వంలో సూళ్లూరుపేట నియోజకవర్గం శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా ముక్కనుమ పర్వదినం రోజున జరిగే ఈ గ్రామోత్సవంలో ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొని స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. శనివారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, వైస్ చైర్మన్ కిలారి గోపి యాదవ్, గూడూరు ప్రభావతమ్మ, గూడూరు సుధీర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య యాదవ్, నీటి సంఘం అధ్యక్షులు ప్రసాద్ నాయుడు, పిఏసిఎస్ అధ్యక్షులు కేవీ నాయుడు, ఉచ్చూరు ప్రసాద్ రెడ్డి, నూతలపాటి ప్రసాద్ నాయుడు, కోట రమేష్ యాదవ్, మేకపిల్ల రవి, రాపూరు పరశురాం, మెరుమ్ చంద్ర, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపీ కార్యకర్త మందా సల్మాన్ హత్య దారుణం!



తడ,జనవరి 17 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామానికి చెందిన దళిత వైఎస్సార్సీపీ కార్యకర్త మందా సల్మాన్ హత్యపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహం వెల్లువెత్తుతోంది. వైఎస్సార్సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బోలింగాలపాడు జయకుమార్ రెడ్డి చంద్రబాబు ప్రభుత్వం మీద తీవ్ర విమర్శలు సంధించారు. పండుగలు వచ్చాయని ప్రజలకు ఆనందం పంచాల్సిన ప్రభుత్వం, దళిత సామాజిక వర్గానికి మాత్రం హత్యలు, గ్రామ బహిష్కరణలు, దమనకాండలను బహుమతులుగా ఇస్తోందని ఆయన మండిపడ్డారు. పిఠాపురం సహా పలు ప్రాంతాల్లో దళితులపై కొనసాగుతున్న వివక్షను గుర్తుచేస్తూ, రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కును కాలరాసే విధానాలు కొనసాగితే ప్రజలు మౌనంగా ఉండరని హెచ్చరించారు. బాధ్యులను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్ష విధించకపోతే వైఎస్సార్సీపీ పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తుందని జయకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ఉపరాష్ట్రపతిని కలిసిన పేట బిజెపి నాయకులు

నాయుడుపేట, జనవరి 17 ప్రభాతవార్త: భారతదేశం ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుని సంక్రాతి సందర్భంగా ఆయనను స్వర్ణభారత్ ట్రస్ట్‌లో కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి నాయకులు, మాజీ ఉపరాష్ట్రపతి బిజెపి సీనియర్ నాయకులు ముప్పవరపు వెంకయ్య నాయుడుని వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో నాయుడుపేటకు చెందిన బిజెపి నాయకులు కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ ఎస్సీ సెల్ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు బొల్లకాయల విజయ్ భాస్కర్, రవి, ఆరూరు సుధాకర్, కె.ప్రసాద్, విద్యాధర్ పలువురు వెంకయ్య నాయుడుని కలిసి, పుష్పగుచ్ఛాలు అందించి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు

తడ,జనవరి 17 ప్రభాతవార్త: సూళ్లూరుపేట మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ మరియు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కుమారి సంయుక్త ఆధ్వర్యంలో మాంబట్టు సెజ్ లొ ఉన్నటువంటి భారతీయ ఫోర్జ్ కంపెనీ నందు పనిచేస్తున్నటువంటి కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు ద్వారా కార్మిక చట్టాలను గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. కార్మిక చట్టాలను కేంద్రీకరించి కొత్తగా తయారు చేసిన నాలుగు చట్టాలను గూర్చి పూర్తి వివరాలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నతాము శ్రీనివాసులు, చక్రవర్తి, నిశాంత సుల్తానా, మధుకర్, చలపతి మరియు కంపెనీ హెచ్ఆర్ అనిల్ గారు పాల్గొనడం జరిగినది.

## మద్యం సేవించి లారీలు నడిపిన డ్రైవర్లకు జరిమానా




వెంకటగిరి, జనవరి 17 ప్రభాతవార్త: మద్యం సేవించి లారీలు నడిపిన ముగ్గురు డ్రైవర్లకు ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు జరిపిన విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ తీర్పు చెప్పినట్లు సిఐ ఏవి రమణ తెలిపారు. లారీల లైసెన్స్ రద్దు చేయమని ఆర్టీవోను జడ్జి ఆదేశించినట్లు చెప్పారు. మద్య సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజు వాహన డ్రైవర్లకు బ్రీతింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



కార్వేటమండపంలో... వేడుకగా గోవిందుని వేట గోవిందరాజ స్వామి పార్వేట ఉత్సవంలో శనివారం సాయంత్రం పార్వేట మండపంలో విడిది. ఆలయ అదికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ప్రభాతవార్త-తిరుపతి

# టిటిడి పట్టువస్త్రాలు తీసుకొచ్చిన ఎంఎల్ఏ పులివర్తినాని

### -శ్రీకోండడ రామస్వామి ఆలయ అధికారులతో పాదయాత్ర

చం ద్రగిరి, జనవరి 17 ప్రభాతవార్త: శ్రీమూలస్థాన ఎల్లమ్మవారి కొండచుట్టు మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి టిటిడి తరపున పట్టువస్త్రాలు అందించడం సంప్రదాయంగా వస్తున్నది. ఈ మేరకు శనివారం శ్రీకోదండరామ స్వామి ఆలయానికి చేరుకున్న టిటిడి పట్టువస్త్రాలు, సారెను ఆలయ అధికారుల నుండి ఎంఎల్ఏ పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి దంపతులు స్వీకరించారు. రాములవారి ఆలయం నుండి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బ్యాండుబాజాల నడుమ ఊరేగింపుగా కాలినడకన అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి పాలక మండలి, ఆలయ ఈఓ మమత ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ఆలయ అర్చకులకు పట్టువస్త్రాలు, సారెను సమర్పించిన పులివర్తి దంపతులను శేషవస్త్రాలతో సత్కరించి, అమ్మవారికి అర్చనలు జరిపించి, తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. సాయంత్రం కొండచుట్టు మహోత్స వానికి హాజరైన



ఎంఎల్ఏ ముందుగా ధర్మరాజుల స్వామి వారి ఆలయానికి చేరుకున్న ఆయన స్వామి వారిని, అశ్వ వాహనంపై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనచే మొదటి హారతిని సమర్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి తిరుమల శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పార్‌పత్తేదార్ హిమ్మత్‌గి, తహశీల్దార్ శివరామసుబ్బయ్య, రామాలయ సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దినేష్, అర్చకులు శ్రీనివాస భట్టర్, టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, మార్కెట్‌యార్డు చైర్మన్ గౌస్‌భాషా, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కూరు ధనంజయ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, టిడిపి చంద్రగిరి క్లస్టర్ ఇన్‌చార్జ్ పోతల ప్రవీణ్ కుమార్, టిడిపి పనపాకం క్లస్టర్ ఇన్‌చార్జ్ మేడసాని కుమార్, పంచాయతీ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, తెలుగు మహిళ విభాగానికి చెందిన మంగాపురం లోకేశ్వరీ, సునీత, రాధ, తదితరులు పాల్గొన్నారు.

## పోటెత్తిన భక్త జనం...రికార్డుస్థాయిలో పూజలు



శ్రీకాళహస్తి,జనవరి 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరా లయం శనివారం భక్తులతో పోటెత్తింది. వరుస సెలవులతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. అయితే ఇక్కడ వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి పొరుగున ఉన్న కర్నాటక,తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది. వేకువ జాము నుంచే ఆలయంలో భక్తులు శివనామస్మరణ చేస్తూ పునీతం చేసారు. సాయంత్రం ఆలయాధికారులు అందించిన సమాచారం మేరకు పాతిక వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు. అలాగే శనివారం కావటంతో శనీశ్వరస్వామి అభిషేకాలు 122 జరిగాయి, సాయంత్రం నిర్వహించే మహాన్యస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 43 జరిగాయి.కాగా రాహుకేతుదోష నివారణ పూజలు సుమారు 5వేలు జరిగినట్లు వివరించారు. ఇక సంస్కరణలతో ప్రతి ఒక్కరు టిక్కెట్లు కొనుగోలు చేయాలనే నిబంధనలతో ప్రత్యేక దర్శనానికి వెళ్ళే భక్తులు అతిధులు సుమారు 8వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు వివరించారు. ఇక ప్రసాదాలు సుమారు పాతికవేలు అమ్ముడుపోయినట్లు వివరించారు.

**ప్రత్యేక పర్యవేక్షణ లేక భక్తుల తిప్పలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన భక్తులకు సుదర్శనం కల్పించుటకు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఎన్నో పథకాలు,సంస్కరణలతో ముందుకు వెళుతున్నారు. అయితే దళారులు ఏదో ఒక దారిలో తమ పబ్బం గడుపుకొనుటకు ప్రయత్నిస్తూనే ఉన్నారు.ఈ నేపథ్యంలో ఇటీవల పోలీసులు ముగ్గురు దళారులను అదుపులో తీసుకొని మందలించారు. ఎన్ని సంస్కరణలు అమలు చేస్తున్నా దళారులు సూక్ష్మంలోనే దారులు వెతుక్కుంటూ ముందుకు నడుస్తున్నారు.దర్శనాలకు భక్తులు తిప్పలుపడుతూనే ఉన్నారు. టిక్కెట్లు కొనుగోలు చేసినా సరైన సమాచారం లేనందువల్ల భక్తుల తిప్పలు వారివే అన్నట్లు మారింది.

## కృష్ణదేవరాయల కీర్తి అజరామరం



తిరుపతి,జనవరి 17 ప్రభాతవార్త: విజయనగర సామ్రాజ్య స్థాపకుడు శ్రీకృష్ణదేవరాయుల పాలన, ఆయన చరిత్ర అజరామరమని బిజెపి నాయకులు కొనియాడారు. శనివారం ఆయన జయంతిని పురస్కరించుకుని లీలామహల్ కూడలిలోని కృష్ణదేవరాయుల విగ్రహానికి బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, లోకప్రభాకర్‌నాయుడు, చంద్రమౌళి, హేమచంద్:, సురేష్‌స్వామి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, డిపి ఆనంద్, కొట్టే సుబ్రమణ్యంరెడ్డి, రామ్‌కుమార్,కిశోర్, హరికృష్ణ తదితరులు పుష్పాంజలి ఘటించారు.

## పొరబాట్లు జరగనివ్వం!

### -మినీబ్రహ్మోత్సవాన సంతృప్తికర సేవలు



తిరుమల,జనవరి 17ప్రభాతవార్తప్రతినిధి: రానున్న ఆదివారం 25వతేదీ రథసప్తమి పర్వదినాన తిరుమలలో చిన్నపొరబాట్లు జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఒకేరోజు ఏడువాహనాలపై ఊరేగి భక్తులను కటాక్షించనున్నారు. ఈ సందర్భంగా తరలివచ్చే 2లక్షలమంది వరకు భక్తులకు సేవలందించడంలో, సౌకర్యాలు కల్పించడంలో, భద్రతపరంగా చిన్నపాటి పొరబాట్లుకు తావులేకుండా ఏర్పాట్లుచేస్తున్నారు. వచ్చే ఆదివారం ఉదయం5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఉత్సవమూర్తి మలయప్ప స్వామి ఉభయదేవేరులతో కలసి సప్తవాహనాలపై భక్తులకు దర్శనమివ్వను న్నారు. అశేషసంఖ్యలో వచ్చే భక్తులకు ఆలయ మాఢవీధుల్లో గ్యాలరీలు, షెడ్లు, తాగునీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## ఘనంగా గోదాదేవి నిమజ్జనం





శ్రీకాళహస్తి,జనవరి 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలోని ఎక్కడాలేని విధంగా వెలంపాళెం నందు శనివారం రాత్రి గోదాదేవి నిమజ్జనం కార్యాక్రమం వైభవంగా నిర్వహించారు. నాలుగు రోజుల పాటు వివిధ ఆలంకరణలో అమ్మవారిని విశేషంగా ఏర్పాటు చేసి ఆరాధించారు. శనివారం ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అమ్మవారికి శనివారం ప్రత్యేకాలంకారం నిర్వహించారు. వెలంపాళెంలో మూడు చోట్ల అమ్మవారిని శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ దర్శించుకున్నారు. మూడు ప్రదేశాల్లో వెలసియున్న గోదాదేవి అమ్మవారికి పూజలు నిర్వహించారు. గౌరమ్మలను ప్రతిష్టించే ప్రదేశంలో నీటి కొళాయి ఏర్పాటు చేసిన, నీటి సదుపాయం కల్పించాలని ఆమెను అభ్యర్థించారు. గౌరమ్మ కమిటి నిర్వాహకులతో ఆమె మాట్లాడుతూ తప్పకుండా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చిరు.

# గూడూరు డివిజన్

## చౌడేశ్వరి, వేమాలమ్మ ఆలయంలో ఘనంగా పూజలు



వెదురుకుప్పం, జనవరి 17 ప్రభాతవార్త : మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయితీ పరిధిలో రేంటాలచేను గ్రామంలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరి దేవి మరియు వేమాలమ్మ అమ్మవారి ఆలయంలో కనుమ పండుగా పురష్కరించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ప్రత్యేక అలంకరణకు సహకరించిన కార్వేటినగరం సాయి, కనికాపురంకు చెందిన బాబురెడ్డికి ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు.కార్యక్రమంకు ఉభయదాతలుగా కనికాపురంకు చెందిన జగన్నాధరెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సవిరెడ్డి కృష్ణ ప్రసాద్ రెడ్డి, ముఖ్యకార్య నిర్వహకులు యర్రసాని కృష్ణారెడ్డి, చెంచుగుడి, పెరుమాళ్ళపల్లె, పాల్యం కోత్తూరు, ఎజ్జుపల్లె, తదితర గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు.

## బ్రాహ్మణపల్లెలో హోరెత్తిన గిత్తల పోరు

### -గిత్తలతో కుస్తీపడ్డ యువత -జనసంద్రంగా మారిన బ్రాహ్మణపల్లె.



వెదురుకుప్పం, జనవరి ప్రభాతవార్త : సంక్రాంతి సంబరాలల్లో భాగంగా మూడవ రోజు శనివారం కనుమ పండుగ పురష్కరించుకుని నిర్వహించిన జల్లి కట్టు సంబరాలు అంబరాన్ని అంటాయి... కొడేగిత్తలు రంకేలు వేయడంతో యువకులు పౌరుషంతో బరిలోకి దిగడంతో జలికట్టు సంబరాలు అంబరాన్ని తాకాయి. ఏటా బ్రాహ్మణపల్లెలో నిర్వహించే గిత్తల పోటీలకు ప్రత్యేకత సంతరించుకోవడంతో తిరుపతి, చిత్తూరు జిల్లాలోని పలు మండలాల నుంచి గ్రామానికి పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకోవడంతో సంక్రాంతి శోభ సంతరించుకుంది. పెద్ద సంఖ్యలో చుట్టు ప్రక్కత గ్రామాల నుంచి రైతులు పోటీలకు దించడంకు గిత్తలను తీసుకు వచ్చారు. రైతులు గిత్తలకు కొమ్ములు చెక్కి రంగులు వేసి చెక్క పట్టీలు కట్టి అందంగా అలంకరించారు. ఇష్ట దైవం, రాజకీయ నాయకులు, సీని ప్రముఖుల ఫోటోలతో కొమ్ములకు చెక్క పట్టీలు,టవలు, నగదు కట్టి యువత పై బరిలోకి దించారు. జనం చేరుకోవడంతో మిద్దెలు, వీధులు జన సంద్రంగా మారిపోయాయి. అలంకరించి గిత్తలను దప్పుల దరువులు మధ్య అల్లె వద్ద వదలడంతో యువకులు రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగి చెక్క పట్టీల కోసం గిత్తలతో కుస్తీకి దిగడంతో ఈలలు, కేరింతల నడుమ నువ్వా... నేనా అంటూ పోటా పోటీగా పోరు జరిగింది. ఎలాంటి అవచనీయమైన సంఘటన చోటుచేసుకోకుండా కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హనుమంతప్ప, వెదురుకుప్పం ఎస్ఐ నవీన్ బాబు,ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పించి రక్షణ చర్యలు చేపటట్టారు. చుట్టు పక్కల మండలాల నుంచి జనం తరలివచ్చారు.

## గణనాధునికి ఘనంగా చందనాలంకార సేవ



కాణిపాకం, జనవరి 17 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారికి సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం ముక్కనుమ రోజున చందనాలంకార సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో ముక్కనుమ రోజున స్వామివారికి చంద నాలంకారసేవను నిర్వహిం చడం ఆనవాయితీ. ఈమేరకు శనివారం స్వామి వారికి ఈ కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకంకు చెందిన సల్లా శివశంకరన్ కుటుంబీకులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉభయదారులు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని చందనం, దూదితో శోభాయమానంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈసందర్భంగా సిద్ధి, బుద్ధి సమేతుడైన గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## రంగవల్లికలు సాంప్రదాయాలకు ప్రతీకలు : పులివర్తి సుధారెడ్డి



తిరుపతిరూరల్, జనవరి17 ప్రభాతవార్త: రంగవల్లికలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి అన్నారు. తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పండుగను పురుస్కరించుకుని గ్రామ సచివాలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించగా, అందులో పులివర్తి సుధారెడ్డి పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల్లో ఆమె స్వయంగా ముగ్గులు వేయడం ద్వారా పాత జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయని, ఇది ఎంతో ఆనందంగా ఉందని సుధారెడ్డి తెలిపారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేయడంతో పాటు ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి మహిళకు బహుమతులను అందజేసి, ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, చిత్తూరు పార్లమెంటరీ కార్యదర్శి చెఋకుల పరంధామ యాదవ్, టిడిపి సీనియర్ నేత చంద్ర ముదిరాజ్, శ్యామ్‌బాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## టౌన్‌బ్యాంక్ మాజీ డైరెక్టర్...కాలేషా మృతి



శ్రీకాళహస్తి,జనవరి 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ మాజీ డైరెక్టర్ పఠాన్ కాలేషా శనివారం మృతి చెందారు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడతూ, తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యంగా పూర్తిగా క్షీణించడంతో పరిస్థితి విషమంగా స్థానికి ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. తెలుగుదేశం పార్టీ అవిర్భావం నుంచి పార్టీ విధేయుడుగా ఉంటూ పార్టీ విజయానికి పాటు పడ్డారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అనుచరవర్గంలో కాలేషా ముందు వరుసలో ఉండేవారు. ఎప్పుడూ పసుపు చొక్కా ధరించి పార్టీ కార్యక్రమాల నిర్వహణలో పాల్గొనే వారు. ఆయన తనయుడు పఠాన్ ఫరీద్ ప్రస్తుతం వైకాపా మైనారిటి సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. కాలేషా మృతికి మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు, పార్టీ ముఖ్యులు సంతాపాలు తెలిపారు.

## విచారణ జరుపుతాం... చర్యలు తీసుకుంటాం!: తహసిల్దార్



రేణిగుంట జనవరి 17 ప్రభాతవార్త అభివృద్ధి పేరుతో వసూళ్లు...చోద్యం చూస్తున్న అధికారులు అనే శీర్షికతో వార్త దినపత్రికలో ప్రచురించిన కథనానికి రేణిగుంట తాహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి స్పందించారు. సదరు కథనంలో దారిద్య రేఖ దిగువ ఉన్న నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన 1.5 సెంట్ల స్థలాలను కొనుక్కొని రెండు ప్లాట్లను ఒకటిగా చేసి డూప్లెక్స్ తరహా ఇల్లు నిర్మిస్తున్నారని మరికొన్ని ఇళ్లకు కరగాళ్లు వేశారని వార్త దినపత్రికలో వచ్చిన సంగతి పాఠకులకు విధితమే. ఈ విషయంపై తహసిల్దార్ సీరియస్ అయ్యారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి భూ ఆక్రమణలపై చాలా నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.తక్షణం పద్మా నగర్ కొత్త కాలనీనందు క్షేత్రస్థాయిలో విచారణ జరపల్సిందిగా విఆర్ఓకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలను వారి పేదరికాన్ని ఆసరాగా తీసుకొని కొనడం నేరమన్నారు. రెండు ప్లాట్లను ఒకటిగా కలిపి ఇల్లు కట్టుకోవడం ఇంకా పెద్ద నేరమన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తక్షణం సర్వే జరిపి డూప్లెక్స్ తరహా ఇల్లు కట్టిన వారికి నోటీసులు ఇస్తామన్నారు. రెండు ప్లాట్లను ఒకటిగా కలిసి ఇళ్లు కట్టినట్లు నిజ నిర్ధారణ జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.